సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 15 । సెప్టెంబర్ । 2025



గాలికుంటు.. తరిమికొట్టు

పశువుల్లో గాలికుంటు వ్యాధి సోకకుండా సోమవారం నుంచి జిల్లావ్యాప్తంగా గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించనున్నారు. 8లో



వాహనాన్ని అమ్ముతున్నారా.. జాగ్రత్త!

వాహనాన్ని అమ్ముతున్నారా! అయితే జాగ్రత్త.. మీరు అమ్మిన వాహనం కొనుగోలు దారుడి పేరుమీద ట్రాన్స్‌ఫర్ కాకపోతే చిక్కులు తప్పవు. 8లో



క్షేత్రంలో తగ్గని భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో ఆదివారం కూడా రద్దీ కొనసాగింది. వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. 8లో



తప్పుడు కేసులతో పత్రికా స్వేచ్ఛకు ముప్పు



ప్రజాస్వామ్యంలో మీడియా ఎప్పుడూ ప్రజల పక్షానే ఉంటూ ప్రభుత్వాల తప్పిదాలను ప్రజల్లోకి తీసుకెళ్తుంది. అలా చేస్తున్న 'సాక్షి' పత్రికపై అక్కసుతో రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం, విచారణ పేరుతో వేధించడం పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించడమే. ప్రచురించిన కథనంలో లోపాలుంటే ప్రభుత్వం వివరణ ఇవ్వాలే గాని కక్ష సాధింపులకు దిగడం సరికాదు. సాక్షి ఎడిటర్, జర్నలిస్టులపై అక్రమ కేసులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి.

– మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, మాజీ ఎమ్మెల్యే, నూజివీడు

అక్రమ కేసులతో వేధించడం దారుణం



ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పత్రికా స్వేచ్ఛపై గొంతు చించుకున్న చంద్రబాబు, టీడీపీ నాయకులు అధికారంలోకి వచ్చాక పత్రికా ప్రతినిధులపై తప్పుడు కేసులు బనాయించడం దారుణం. ప్రభుత్వ తప్పిదాలను, అధికార పార్టీ నేతల అక్రమాలను ప్రజల ముందుంచడం కూటమి ప్రభుత్వానికి తప్పిదంగా కనిపిస్తోంది. 'సాక్షి' మీడియాను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులతో వేధించడం దారుణం. దీనిని అందరూ ముక్తకంఠంతో ఖండించాలి.

– పుప్పాల వాసుబాబు, మాజీ ఎమ్మెల్యే, ఉంగుటూరు

న్యూస్‌రీల్

పని ఒత్తిడితో వీఆర్వోల మరణాలు



మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు రవీంద్రరాజు

భీమవరం: అధికారుల తీవ్ర పని ఒత్తిడితో కొందరు వీఆర్వోలు ఆందోళన చెంది గుండెపోటుతో, యాక్సిడెంట్లతో మరణిస్తున్నారని జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు అన్నారు. స్థానిక అంకాల ఆర్ట్స్ భవనంలో ఆదివారం సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల స్థలాల వెరిఫికేషన్, రీ సర్వే, పీజీఆర్ఎస్ విచారణలు, కొత్తగా వచ్చిన పాస్ పుస్తకాల వెరిఫికేషన్‌తో పాటు రోజువారీ పనులు చేసేందుకు వీఆర్వోలు ఇబ్బంది పడుతున్నారన్నారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందులను అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లకపోవడంతో వీఆర్వోలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇలానే అధికారులు వీఆర్వోలను ఇబ్బందులకు గురిచేస్తే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించి ఆందోళనకు పిలుపునిస్తామని చెప్పారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్ గుమ్మల జకరయ్య, జిల్లా కోశాధికారి చిట్టిబాబు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అనూష, భీమవరం డివిజన్ అధ్యక్షుడు కేడీఎస్ కెనడీ, సెక్రటరీ సురేష్, నరసాపురం డివిజన్ అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం జిల్లా, మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిల్లో నిర్వహించనున్నట్టు కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియజేయజేయవచ్చన్నారు.

పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు వేతనాలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్ ఎగ్జిక్యూటివ్ బాడీ సభ్యులు

భీమవరం: ఆగస్టు నెల వేతనాలు విడుదల కాకపోవడంపై పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు (పీటీఐ) తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఏఆర్‌కేఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్ మండల ఎగ్జిక్యూటివ్ బాడీ సభ్యుల జిల్లాస్థాయి సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాస్ అధ్యక్షతను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిధులు సేకరించి అయినా సరే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పీటీఐలకు వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సెక్రటరీ పి.సుబ్బారావు మాట్లాడుతూ సంఘ ఐక్యతతోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.వీరభద్రాచార్యులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే ప్రతి సూచనను కచ్చితంగా పాటిస్తూ, యూనియన్ బలంగా ఉండేలా అందరూ సహకరించాలన్నారు. వైస్ ప్రెసిడెంట్ టి.చినబాబు, టి.వీరభద్రాచార్యులు, పి.వినయ్‌కుమార్, ఎస్.సాయినాథ్ పాల్గొన్నారు.

దిగుమతి సుంకం రద్దు సరికాదు

జంగారెడ్డిగూడెం: కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతులపై 11 శాతం సుంకాన్ని రద్దు చేయడంపై ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ పత్తిపై దిగుమతి సుంకం రద్దు చేయడం దేశవ్యాప్తంగా పత్తి రైతులకు మరణ శాసనమన్నారు. దీంతో దేశీయ మార్కెట్‌లో పత్తి ధరలు తగ్గి రైతులు నష్టాలపాలవుతారన్నారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీని తగ్గించుకునే కుట్రలో భాగంగానే యూరియా దిగుమతి చేసుకోకుండా కొరత సృష్టిస్తోందని విమర్శించారు.

శ్రీవారికి స్వర్ణ కిరీటం సమర్పణ



ఈఓకి మూర్తికి స్వర్ణ కిరీటాన్ని అందిస్తున్న దాత

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీవారి ఉత్సవమూర్తికి ఏలూరుకు చెందిన కూచి కృష్ణమూర్తి శర్మ ఆదివారం రూ.1.55 లక్షల విలువైన 14 గ్రాముల బరువుగల స్వర్ణ కిరీటాన్ని సమర్పించారు. ముందుగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తికి స్వర్ణ కిరీటాన్ని అందజేశారు. దాతను ఈఓ ప్రత్యేకంగా అభినందించారు.

చింతలపూడిలో నల్ల బంగారం

- మెట్టలో విస్తారంగా బొగ్గు నిక్షేపాలు
- ఎట్టకేలకు రేచర్ల బ్లాక్‌కు టెండర్ల ప్రక్రియ
- నేడు ప్రీబిడ్ సమావేశం
- 22 కిలోమీటర్ల పరిధిలో 2,225 మిలియన్ టన్నుల నిల్వలు
- వచ్చేనెల 27 వరకు టెండర్ల దాఖలుకు అవకాశం
- నవంబర్ నెలాఖరుకు ఈ–ఆక్షన్



చింతలపూడి ప్రాంతంలో అధునాతన యంత్రాలతో బొగ్గు అన్వేషణ చేస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఏలూరు జిల్లా చింతలపూడికి మహర్దశ పట్టనుంది. సుమారు రెండు దశాబ్దాలుగా విస్తృతంగా చర్చల్లో ఉన్న బొగ్గు నిల్వల వ్యవహారం కొలిక్కి వచ్చింది. ఏయే ప్రాంతాల్లో ఏ మేర నిల్వలు ఉన్నాయనే గుర్తింపులు పూర్తి చేసి వేలం దశకు కేంద్రం తీసుకువచ్చింది. దీనిలో భాగంగా జిల్లాలో మొదటిగా చింతలపూడి మండలం రేచర్ల బొగ్గు బ్లాక్‌కు టెండర్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. సోమవారం ప్రీబిడ్ సమావేశం నిర్వహించి వచ్చే నెల 27 వరకు టెండర్లు తీసుకునేలా కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది.

గ్రేడ్–1 నిల్వలు

జిల్లాలోని మెట్ట ప్రాంతమైన చింతలపూడి నియోజకవర్గ పరిసర ప్రాంతాల్లో అపార బొగ్గు నిక్షేపాలు ఉన్నాయి. అది కూడా గ్రేడ్–1 నిల్వలు ఉన్నట్టు అధికారికంగా నిర్ధారించారు. 1964 నుంచి 2004



జీఎస్ఐ సర్వేలో బొగ్గు నిల్వలు ఉన్న ప్రాంతం నుంచి సేకరించిన శాంపిల్స్ (ఫైల్)

వరకు కేంద్ర ప్రభుత్వం నాలుగు దఫాలుగా రకరకాల సర్వేలు నిర్వహించింది. మళ్లీ 2006 నుంచి 2016 వరకు సర్వే ప్రక్రియ అత్యంత వేగంగా కొనసాగింది. ప్రధానంగా ఏలూరు, ఖమ్మం జిల్లాల సరిహద్దులో 2,500 చదరపు కిలోమీటర్ల పరిధిలో అపార నల్ల బంగారం నిక్షేపాలున్నట్టు గుర్తించింది. గతంలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ దీనిపై కేంద్రానికి కూడా నివేదిక పంపింది. ఈ పరిణామాల క్రమంలో చింతలపూడి, టి.నర్సాపురం, జంగారెడ్డిగూడెం మండలాల్లో కొన్ని గ్రామాల్లో గ్రేడ్–1 బొగ్గు భూగర్భంలో ఉన్నట్టు గుర్తించారు. గతంలో చింతలపూడి మండలంలో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) నిపుణుల బృందం సర్వే నిర్వహించింది. లక్నోకు చెందిన బీర్బల్ సహాని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలియోబొటానీ అనే సంస్థ 2013లో ఉభయగోదావరి, కృష్ణా, ఖమ్మం జిల్లాల్లో సర్వే చేసింది. ప్రధానంగా గోదావరి పరీవాహక ప్రాంతంలోని చింతలపూడి, ముసునూరు మండలాల్లో సర్వే నిర్వహించింది. గతేడాది కేంద్రానికి నివేదిక సమర్పించి బొగ్గు ఉన్న ప్రాంతాలను బ్లాక్‌లుగా విభజించి వేలం ప్రక్రియకు శ్రీకారం చుట్టేలా చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో ఈ ఏడాది మార్చిలో దేశవ్యాప్తంగా 80 గనుల వేలానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. చింతలపూడి బ్లాక్‌ను వేలం జాబితాలో ఉంచినా సింగరేణి సహా ప్రధాన కంపెనీలు పోటీకి రాకపోవడంతో వేలం వాయిదా పడింది. ఈ నేపథ్యంలో గత వారంలో లాంఛనాలు పూర్తి చేసి టెండర్‌కు సన్నద్ధమయ్యారు. దీనిలో జిల్లాలోని చింతలపూడి మండలం రేచర్ల బొగ్గు బ్లాక్‌తో పాటు దేశవ్యాప్తంగా మరో 13 బ్లాక్‌లకు కలిపి టెండర్లకు ఆహ్వానించారు. 22.24 చదరపు కిలోమీటర్ల పరిధిలో రేచర్ల కేంద్రీకృతంగా యర్రగుంటపల్లి, సీతానగరం, మేడిశెట్టివారిపాలెం, లింగగూడెం, రాఘవాపురం తదితర గ్రామాల్లో బొగ్గు నిల్వలను నిర్ధారించారు.

2,225 మిలియన్ టన్నులు

ఆంధ్రా–తెలంగాణ సరిహద్దు సమీపంలో ఉన్న రేచర్ల బొగ్గు బ్లాక్ పరిధి 22.24 చదరపు కిలోమీటర్లు. ఇక్కడ జీ–13 గ్రేడ్ బొగ్గు లభిస్తుందని, 623 మీటర్ల లోతు నుంచి గరిష్టంగా 1,123 మీటర్ల లోతులో నిల్వలు ఉన్నాయని, 2,225.63 మిలియన్ టన్నుల నిల్వలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని అంచనా వేసి టెండర్లను ఆహ్వానించారు. సోమవారం ప్రీబిడ్ సమావేశం నిర్వహించి వచ్చే నెల 27 వరకు టెండర్ దాఖలుకు తుది గడువుగా ప్రకటించారు. 28న టెక్నికల్ బిడ్‌లు తెరిచి నవంబర్ చివరి వారంలో ఈ–వేలం ద్వారా బొగ్గు గనిని కేటాయించనున్నారు.

కలెక్టర్ మేడమ్.. ఇవేమి ఆర్డర్లు!

- ఒకే రోజు రెండు మార్పులా?
- ఆరోపణలు ఉన్న వ్యక్తికి ఇన్‌చార్జి బాధ్యతలా?



ఇన్‌చార్జి తహసీల్దార్ బాధ్యతలు డీటీకి ఇస్తూ ఆదేశాలు

ఆకివీడు: రెవెన్యూ ఉద్యోగుల బదిలీ అధికారం కలెక్టర్‌కు ఉంది. అయితే ఒకే రోజు రెండు ఆదేశాల జారీతో ఆకివీడు రెవెన్యూ కార్యాలయంలో కలకలం ఏర్పడింది. శనివారం ఉదయం ఆకివీడు తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావును కలెక్టరేట్‌కు అటాచ్ చేశారు. అదే సమయంలో ఆచంట డిప్యూటీ తహసీల్దార్ సోమేశ్వరరావుకు ఆకివీడు తహసీల్దార్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇంతలోనే రాజకీయం మారిపోయింది. పలుకుబడి, మరే ఆయుధం ఉపయోగించారో తెలియదుగానీ సోమేశ్వరరావుకు ఇచ్చిన ఇన్‌చార్జి బాధ్యతల్ని నిలుపుదల చేసి, ఆకివీడు రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ ఫరూక్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ మరో ఉత్తర్వులు జారీ చేశారు. భీమవరం కలెక్టరేట్ నుంచి ఒకే రోజు ఇలా రెండు ఆదేశాలు రావడం చర్చనీయాంశమైంది. ఆరోపణలున్న అధికారికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడమేంటని పలువురు గుసగుసలాడుతున్నారు. రెండు ఆర్డర్లలో కలెక్టర్ సంతకాలు వేర్వేరుగా ఉండటం అనుమానాలకు తావిస్తుంది. దీనిపై కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించాలని పలువురు కోరుతున్నారు.

ఉధృతంగా వాగులు



కొయ్యలగూడెం : కన్నాపురం–యర్రాయిగూడెం మధ్య కొట్టుకుపోయిన కాజ్‌వే



చాట్రాయి : కొత్తగూడెం–యర్రావారిగూడెం మధ్య ఉప్పు వాగులో వరద ఉధృతి

కొయ్యలగూడెం: ఎడతెరపి లేని వర్షాలకు వాగులు ఉధృతంగానే ప్రవహిస్తున్నాయి. ఆదివారం మండలంలోని మంగపతిదేవిపాలెం, పంగిడిగూడెం గ్రామాల మధ్య ఎర్రకాలువ ఉధృతికి రాకపోకల స్పందించాయి. కాజ్‌వేపై నుంచి వరద నీరు ప్రవహించింది. కన్నాపురం–యర్రాయిగూడెం మధ్య తూర్పు కాలువపై కాజ్‌వే కొట్టుకుపోయింది. ఏడాది క్రితం నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా కాజ్‌వే నిర్మించడంతో కొట్టుకుపోయినట్టు ప్రజలు చెబుతున్నారు. అలాగే అంకాలగూడెంలోని నూతికుంట కాలువ వరద ఉధృతికి గ్రామంలోని దళితవాడ ముంపును గురైంది. సీసీ రోడ్లపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. నూతికుంట కాలువ పూడికతీత పనులు చేపట్టాలని ఏడాది నుంచి మొత్తుకుంటున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్య జటిలమైందని మాజీ ఉప సర్పంచ్ జి.వీరభద్రం అంటున్నారు.

తమ్మిలేరు రిజర్వాయర్‌కు భారీగా వరద

చాట్రాయి: ఖమ్మం జిల్లాలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరుతోంది. 1,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 2 వేల క్యూసెక్కుల నీటిని కిందకు వదులుతున్నట్టు ప్రాజెక్టు ఏఈ లాజరుబాబు తెలిపారు. మండలంలో భారీ వర్షాలతో రేగడి వాగు, ఉప్పు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో కొత్తగూడెం, యర్రావారిగూడెం, చాట్రాయి, జనార్దనవరం గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది.

పొంగుతున్న వాగులు

ముసునూరు: మండలంలోని వాగులు పొంగుతున్నాయి. రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెం, గోగులంపాడులో సంధ్యపు వాగు పొంగడంతో ముసునూరు, వలసపల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. చెక్కపల్లి పెద్ద చెరువు అలుగు వరదతో దిబ్బగూడెం కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. తమ్మిలేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో వలసపల్లి బలివే వంతెన మీదుగా ప్రయాణాలు చేయాలని అధికారులు సూచించారు.

రామిలేరు వాగులో యువతి గల్లంతు



బడిపాటి నీరజ (ఫైల్)

నూజివీడు: మండలంలోని తుక్కులూరు వద్ద ఉన్న రామిలేరు వాగులో వరద ఉధృతికి ఓ యువతి గల్లంతైంది. ఆదివారం గ్రామంలోని పాత దళితవాడకు చెందిన బడిపాటి సర్వేశ్వరరావు కుమార్తె నీరజ (19) దళితవాడ నుంచి పక్కనే ఉన్న మర్రికుంటలోని చర్చికి వెళ్లింది. అక్కడి నుంచి మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి వస్తుండగా రామిలేరు వాగులో చప్టాపైకి ఎక్కి దాటేందుకు ప్రయత్నించగా వరద ఉధృతికి కొట్టుకుపోయింది. అక్కడే కాపలాగా ఉన్న కానిస్టేబుల్, వీఆర్వో చెప్పినా ఆమె వినలేదు. స్థానిక యువకులు వాగులో గాలించినా నీరజ ఆచూకీ లభించలేదు. నీరజ నూజివీడులో బీ ఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తహసీల్దార్ గుగులోతు బద్రూనాయక్ వాగు వద్దకు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. రాకపోకలను పూర్తిగా నిలిపివేయడంతో పాటు అగ్నిమాపక సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు స్థానికులు కూడా రామిలేరు వాగులో గాలిస్తున్నారు. నీరజ గల్లంతవ్వడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. సబ్‌కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న యువతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. తహసీల్దార్ గుగులోతు బద్రూనాయక్, సర్పంచ్ తొమ్మండ్రు బుజ్జి తదితరులు ఉన్నారు.

కేంద్ర మంత్రి వ్యాఖ్యలతో కూటమిలో దుమారం

- పరిణామాలు తీవ్రంగా ఉంటాయని శ్రీనివాసవర్మ హెచ్చరిక
- కూటమిలో మరోసారి బయటపడ్డ విభేదాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

సాక్షి, టాస్క్‌ఫోర్స్: తనలోని అపరిచిత వ్యక్తిని బయటకుతీస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయంటూ కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ శనివారం భీమవరంలో చేసిన వ్యాఖ్యలు కూటమి నాయకుల్లో తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. శ్రీనివాసవర్మ సామాన్యుడని తన మంచితనాన్ని చేతగానితనంగా చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఏడాదిన్నర క్రితం జరిగిన పార్లమెంట్ ఎన్నికల సమయంలో కూడా తనను చులకన చేస్తూ కొంతమంది రాజకీయ నాయకులు మాట్లాడారని ఆయన గుర్తుచేశారు. ఇలా శ్రీనివాసవర్మ చేసిన వ్యాఖ్యలు కూటమి పార్టీలోని ఉండి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణను ఉద్దేశించినవిగా ప్రచారం జరుగుతోంది. గతేడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో శ్రీనివాసవర్మను బీజేపీ నరసాపురం ఎంపీ అభ్యర్థిగా ప్రకటించింది. అదే సీటును టీడీపీ, జనసేన తరపున ఆ పార్టీల్లో సభ్యత్వం లేనప్పటికీ కనుమూరి రఘురామకృష్ణరాజు, బీజేపీ తరపున రాష్ట్ర క్రమశిక్షణ సంఘ చైర్మన్‌గా ఉన్న పాకా వెంకట సత్యనారాయణ ఆశించారు. అప్పటికే శ్రీనివాసవర్మకు సీటును బీజేపీ ఖరారు చేసినా మార్పు జరుగుతుందని, తానే ఎంపీగా పోటీలో ఉంటానని రఘురామకృష్ణరాజు బహిరంగంగానే ప్రచారం చేసుకున్నారు. ఈ సమయంలో శ్రీనివాసవర్మ సామాన్యుడని, అతని వద్ద డబ్బు లేదని, ప్రజలకు అందుబాటులో ఉండరని, ఎంపీ అభ్యర్థిగా సరిపోడంటూ ప్రచారం చేసి సీటు మార్పు చేసి తనకే నరసాపురం ఎంపీ అభ్యర్థిత్వం ఇస్తారంటూ ప్రచారం చేసుకున్నారు. ఎంపీ అభ్యర్థిత్వం కోసం రఘురామకృష్ణరాజు తీవ్రంగా ప్రయత్నించినా సీటు దక్కకపోవడంతో ఉండి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ ఆయనకు సీటు ప్రకటించింది. ఎన్నికల సమయంలో శ్రీనివాసవర్మ, రఘురామకృష్ణరాజు మధ్య పెద్దగా సఖ్యత లేకుండానే ఎన్నికల ప్రచారం కొనసాగింది. పాకా సత్యనారాయణ కూడా అప్పటి వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలకు మద్దతుగా ప్రచారం చేశారనే అనుమానాలు శ్రీనివాసవర్మలో ఉన్నాయని ప్రచారంలో ఉంది.

మొక్కుబడి మాటలు.. విభేదాలు

ఎంపీగా శ్రీనివాసవర్మ, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఎన్నికైనప్పటి నుంచి వారిద్దరూ మొక్కుబడిగా మాట్లాడుకోవడం తప్ప వారి మధ్య సఖ్యత లేదని కూటమి నాయకులే చెబుతుంటారు. పాకా, శ్రీనివాసవర్మ మధ్య కూడా విభేదాలున్నాయనే ప్రచారముంది. భీమవరం నుంచి కలెక్టరేట్ తరలింపు, భీమవరం మున్సిపాల్టీ నుంచి పక్క నియోజకవర్గమైన పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామంలోని నాన్ లేఅవుట్ ఏరియాకు మంచినీటి పైపు లైన్ వేయించడంలో రఘురామకృష్ణరాజు పాత్ర ఉందనే ప్రచారముంది. కలెక్టరేట్ భీమవరంలోనే ఉండాలనే ఆశయంతో శ్రీనివాసవర్మ ఉండగా, దానికి రఘురామకృష్ణరాజు గండి కొడుతున్నారని, దీంతో వీరి మధ్య దూరం మరింత పెరిగిందని సమాచారం. అంతేగాకుండా శ్రీనివాసవర్మ సాధించినట్టు చెప్పుకొంటున్న పలు అభివృద్ధి పనులు రఘురామకృష్ణరాజు, రాజ్యసభ సభ్యుడు సత్యనారాయణ ఇద్దరూ తాము కూడా చెప్పడం వల్లనే సాధ్యమయ్యాయని పార్టీ నాయకులు, కార్యకర్తలకు చెబుతున్నట్టు శ్రీనివాసవర్మకు తెలియడంతో వారిద్దరినుద్దేశించే సర్మగర్భంగా విలేకరుల సమావేశంలో వ్యాఖ్యలు చేసినట్టు కూటమి నాయకులు గుసగుసలాడుతున్నారు. కూటమిలోని నాయకుల మధ్య నెలకొన్న వివాదం రానున్న రోజుల్లో ఏ స్థాయికి చేరుతుందో వేచిచూడాలి మరి.

ప్రాణాలు తీస్తున్న రహదారి గుంతలు

అధ్వానంగా చిన వెంకన్న క్షేత్ర రహదారి



గాయపడిన సురేష్

ద్వారకాతిరుమల: చిన వెంకన్న క్షేత్రానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో మండలంలోని సూర్యచంద్రరావుపేట వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. గత నెల రోజుల్లో 9 ప్రమాదాలు జరగ్గా, ముగ్గురు మృతి చెందారు. మరో ఆరుగురు క్షతగాత్రులయ్యారు. తాజాగా ఆదివారం రాత్రి గుడివాడ నుంచి స్కూటీపై ద్వారకాతిరుమల క్షేత్రానికి వెళుతున్న భక్తుడు తుమ్మల సురేష్ ఇవే గుంతల వద్ద వాహనం అదుపుతప్పి పడిపోయాడు. ఆయన తలకు తీవ్ర గాయాలుకాగా స్థానికులు 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ముందే హెచ్చరించిన 'సాక్షి'



జూన్ 27న సాక్షిలో ప్రచురించిన కథనం

క్షేత్ర ప్రధాన రహదారి చిద్రంపై అధికారులను హెచ్చరిస్తూ జూన్ 27న 'సాక్షి' కథనాన్ని ప్రచురించింది. అయినా అధికారుల్లో స్పందన లేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

క్లుప్తంగా

రాట్నాలమ్మకు రూ.1,05,052 ఆదాయం


ప్రత్యేక పూలాలంకరణలో రాట్నాలమ్మ

పెదవేగి: రాట్నాలమ్మ దేవస్థానం ఈ వారం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి మొక్కుబడులను తీర్చుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ వారం అమ్మవారికి మొత్తం రూ.1,05,052 ఆదాయం లభించిందని దేవస్థాన ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా దేవస్థాన సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు


సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారి పుట్టలో పాలు పోశారు. పాలపొంగళ్ల శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద స్వామివారి మూర్తులను ప్రతిష్ఠించేందుకు అర్చకులతో పూజలు చేయించి ప్రతిష్ఠ తంతు నిర్వహించారు. నాగబంధాల వద్ద, గోకులంలోని గోవులకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద ఏర్పాట్లు చేశారు.

పెద్దింట్లమ్మ దేవస్థానంలో భక్తుల రద్దీ

కైకలూరు: పెద్దింట్లమ్మ నామస్మరణతో కొల్లేటికోట అమ్మవారి దేవస్థానం మార్మోగింది. సమీప జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఆదివారం దర్శనానికి విచ్చేశారు. మహిళలు భక్తి శ్రద్ధలతో పెద్దింట్లమ్మకు పొంగళ్లు సమర్పించారు. పలు గ్రామాల నుంచి అమ్మకు మొక్కుబడిగా వేడి నైవేద్యాలను అందించారు. ఆలయ ప్రధాన ఉప అర్చకులు పేటేటి పరమేశ్వరశర్మ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ ఒక్క ఆదివారం రోజున ప్రత్యేక, అంతరాలయ దర్శనాలు, కేశఖండన, పెద్ద, చిన్న తీర్థాలు, లడ్డు ప్రసాదం, గదులు అద్దెలు, అమ్మవారి ఫొటోల అమ్మకం, వాహన పూజలు, విరాళాల ద్వారా రూ.70,165 ఆదాయం వచ్చిందని చెప్పారు.

తల్లీకొడుకుల ఆత్మహత్యాయత్నం

దెందులూరు: చల్ల చింతలపూడి పంచాయతీ కొత్త కమ్మవారిగూడెం గ్రామానికి చెందిన ఆలపాటి షణ్ముఖ సాయి పవన్ ఆదివారం గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. మనస్తాపంతో తల్లి స్వరూపరాణి కూడా గడ్డి మందు తాగింది. కుటుంబ సభ్యులు, స్థానికులు ఏలూరులోని వైద్యశాలకు తీసుకువెళ్లారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. సాయి పవన్‌కు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని కాకినాడకు చెందిన ఒక వ్యక్తి డబ్బులు తీసుకొని ఉద్యోగం వేయించకపోగా డబ్బులు ఇవ్వడం లేదు. దీంతో పవన్ కాకినాడలో అతని చుట్టూ చాలా సార్లు తిరిగి డబ్బులు ఇవ్వకపోవడంతో విసిగి పోయాడు. ఆదివారం గడ్డి మందు తాగడంతో తట్టుకోలేని తల్లి కూడా గడ్డి మందు తాగి ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని చెబుతున్నారు.

వాహనాన్ని అమ్ముతున్నారా.. జర జాగ్రత్త!

- వాహనాన్ని మీ పేర బదిలీ చేయించకపోతే చిక్కే
- అపరిచితులకు అమ్మితే అంతే సంగతి



తణుకు అర్బన్ : మీ వాహనాన్ని అమ్ముతున్నారా! అయితే జర జాగ్రత్త.. అపరిచిత వ్యక్తులకు అమ్మితే ఇబ్బందులే. మీరు అమ్మిన వాహనం కొనుగోలుదారుడి పేరుమీద ట్రాన్స్‌ఫర్ కాకపోతే చిక్కులు తెచ్చుకున్నట్లే.. సెకండ్ హ్యాండ్ వాహన కొనుగోళ్లు, విక్రయాల్లో వాహన విలువకు ఇచ్చే ప్రాధాన్యత ఆ వాహనం ధృవపత్రాలు సక్రమమేనా, సదరు విక్రయదారుడు కరెక్టేనా అనే వివరాలు తెలుసుకోకపోవడం.. వాహనాన్ని ట్రాన్స్‌ఫర్ చేయించకపోవడంతో భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

పేరు మారకపోతే చిక్కులే

వాహన విక్రయాల్లో కొనుగోలుదారుడి పేరుకు వాహనం బదిలీ కాకపోతే వచ్చే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. పాత వాహనాన్ని అమ్మిన తరువాత కొనుగోలుదారుడి పేరుమీద వాహనాన్ని ట్రాన్స్‌ఫర్ చేయని పక్షంలో సదరు వాహనం వల్ల రోడ్డు ప్రమాదం జరిగితే.. వాహనం ఎవరి పేరు మీద ఉంటే వారే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఆ వాహనాన్ని ఉపయోగించి ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా.. బాధితుల ఫిర్యాదు మేరకు సదరు వాహనం ఎవరి పేరుమీద ఉంటే వారే శిక్షార్హులు. ఒక్కో సందర్భంలో క్రిమినల్ కేసుల నమోదుతోపాటు జైలు జీవితాన్ని కూడా అనుభవించాల్సి ఉంటుంది.

పాత వాహనాల విక్రయాలు అధిక శాతం ప్రైవేటు కన్సల్టెన్సీల ద్వారానే జరుగుతున్నాయి. అయితే.. పాత వాహనాలను కొనుగోలుదారుడి పేరుమీదకు బదిలీ చేయించే ప్రక్రియపై ఇటు కన్సల్టెన్సీలు, విక్రయదారులు అశ్రద్ధ వహిస్తున్నారు. దీంతో వచ్చే తగాదాలు, గొడవలు పోలీస్, రవాణా శాఖ అధికారులకు తలనొప్పిగా మారాయి. ముఖ్యంగా సెకండ్ హ్యాండ్ వాహనాల విక్రయాల్లో ఈ తరహా ఇబ్బందులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత కన్సల్టెన్సీ యాజమాన్యాలదే. ద్విచక్ర వాహనాల నుంచి పెద్ద వాహనాల వరకు ఈ సమస్య ఉన్నా అధికశాతం మాత్రం ద్విచక్ర వాహనాల సమస్యలే బయటపడుతున్నాయని అధికారులు చెబుతున్నారు. వాహన కొనుగోళ్ల తరువాత తమ పేర్ల మీద మార్చుకోకపోతే సదరు వాహనానికి బీమా చేయించుకునే పరిస్థితి ఉండదు. దీంతో ఏ ప్రమాదాలు చోటుచేసుకున్నా బీమా క్లెయిమ్ వచ్చే అవకాశం ఉండదు.

పేరు మార్చుకోకపోతే మీదే బాధ్యత



వాహనాల విక్రయాల్లో కొనుగోలుదారుడి పేరు మీద వాహనాన్ని బదిలీ చేయించకపోతే విక్రయదారుడు ఫలితం అనుభవించాల్సిందే. ఆ వాహనం ఎక్కడ యాక్సిడెంట్ చేసినా, అసాంఘిక కార్యకలాపాల్లో పోలీసుల చేతికి దొరికినా శిక్షార్హులే. వాహన క్రయ విక్రయాలకు సంబంధించి ఆర్థిక లావాదేవీల సమయంలోనే వాహన యజమాని పేరు బదిలీ తప్పనిసరిగా చేయించాలి. – ఎస్.శ్రీనివాసు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, తణుకు

మాల మహాసేన కార్యవర్గ నియామకం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మాల మహాసేన రాష్ట్ర కమిటీ నూతన కార్యవర్గ నియామకం ఆదివారం జరిగింది. మహాసేన జాతీయ అధ్యక్షుడు ఎ.రవికుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నియామకాలు చేపట్టారు. ఉపాధ్యక్షుడిగా వాసే జయపాల్, జాతీయ ముఖ్య సలహాదారుగా తోట రాజు, ఎడ్యుకేషన్ సెక్టార్ అధ్యక్షుడిగా వాసే రత్నం, ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా నిట్టా శ్రీను, జిల్లా యూత్ ప్రెసిడెంట్‌గా నల్లమిల్లి నాని, కార్మిక శాఖ అధ్యక్షుడిగా మెరుగు అభిషేక్ కుమార్ నియమితులయ్యారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

భీమవరం: బైక్‌పై వెళ్తున్న వ్యక్తి రోడ్డు మలుపులో అదుపుతప్పి పడిపోవడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. భీమవరం టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. పాలకోడేరు మండలం కుముదవల్లి గ్రామానికి చెందిన అల్లూరి మురళీ రాజు (47) భీమవరం నుంచి ఉండి రోడ్డు వైపు వెళ్తుండగా బైక్ అదుపుతప్పి పడిపోయాడు. తీవ్రంగా గాయపడడంతో చికిత్స కోసం భీమవరంలో ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందారని మృతుడి బంధువులు తెలిపారని పోలీసులు చెప్పారు.

క్షేత్రంలో తగ్గని భక్తుల రద్దీ


భక్తులతో నిండిపోయిన అనివేటి మండపం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ ఆదివారం సైతం కొనసాగింది. సెలవు దినం కావడంతో వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దాంతో క్షేత్ర పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. దర్శనం క్యూలైన్లు, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, కల్యాణ కట్ట తదితర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. అనివేటి మండపంలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి. ఆలయంలో సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. క్షేత్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని సోమవారం నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు ఆలయ ఈఓ తెలిపారు.

అఫీషియల్ రిసీవర్‌గా ఇందిరా ప్రియదర్శిని

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా (ఓఆర్) అఫీషియల్ రిసీవర్‌గా నగరానికి చెందిన న్యాయవాది మజ్జి ఇందిరా ప్రియదర్శిని శేఖర్ నియమితులయ్యారు. ఏలూరు కోర్టు ఆవరణలో ప్రియదర్శినికి కోర్టు పరిపాలనాధికారి బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అఫీషియల్ రిసీవర్‌గా తన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానన్నారు.

కార్పొరేట్ల అనుకూల విధానాలు



నూజివీడులో కార్మికుల ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు తదితరులు

నూజివీడు: కార్పొరేట్ శక్తుల కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని, పోరాటలతోనే హక్కులు సాధించుకోగలమని లేకపోతే పాలకులు కార్మికులను పట్టించుకునే పరిస్థితి లేదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజా రామ్మోహన్‌రాయ్ అన్నారు. నూజివీడులో రెండు రోజులుగా నిర్వహిస్తున్న సీఐటీయూ ఏలూరు జిల్లా 13వ మహాసభలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజా రామ్మోహన్ రాయ్ మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల కార్మికులు చాలీ చాలని వేతనాలతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. మోదీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు తీవ్రప్రయత్నం చేస్తోందన్నారు. యాజమాన్యాలు కాంట్రాక్ట్ పద్ధతిలో కార్మికులను నియమించుకోవడానికి మొగ్గు చూపుతున్నాయని, పరిశ్రమలలో శాశ్వత ఉద్యోగులు 30 శాతం కన్నా ఎక్కువ లేరన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి అమలులో ఉన్న 40 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడానికి కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌వీఎస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ద్వారకాతిరుమల: ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుల మందు తాగిన ఒక మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని తిమ్మాపురానికి చెందిన పాతపాటి పద్మజ(42) ఈనెల 13న ఉదయం కాలినడకన శ్రీవారి క్షేత్రానికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయల్దేరింది. అదే గ్రామంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి గుడి వద్దకు వచ్చిన తరువాత పురుగుల మందు తాగి కుప్పకూలి పడిపోయింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పద్మజను ఏలూరు ఆశ్రం ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో ఆమె మృతి చెందింది.

గుబ్బల మంగమ్మను దర్శించుకున్న భక్తులు


గుబ్బల మంగమ్మ తల్లి గుడి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

బుట్టాయగూడెం: అధిక వర్షాల కారణంగా కొండ వాగులు పొంగుతున్న నేపథ్యంలో ఆదివారం గుబ్బల మంగమ్మతల్లి దర్శనాన్ని నిలిపివేస్తున్నట్లు స్థానిక పోలీసులు, ఆలయ కమిటీ ప్రకటించింది. తెల్లవారుజామున అధిక సంఖ్యలో భక్తులు కామవరానికి చేరుకున్నారు. వాతావరణం అనుకూలంగా ఉండడంతో వారిని గుబ్బల మంగమ్మతల్లి దర్శనానికి అనుమతించారు. దీనితో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎర్ర కాలువకు వరద నీరు


నందమూరు కొత్త అక్విడెక్ట్ వద్ద ఎర్ర కాలువ వరద

తాడేపల్లిగూడెం రూరల్: ఎర్ర కాలువకు వరద నీరు చేరుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు, డ్రెయిన్లు పొంగి పొర్లడంతో ఈ నీరు ఎర్ర కాలువకు వస్తోంది. తాడేపల్లిగూడెం మండలం మాధవరం–కంసాలిపాలెం బ్రిడ్జి వద్ద ఆదివారం వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. నందమూరు కొత్త అక్విడెక్ట్ వద్ద 28.9 అడుగులకు వరద నీరు చేరుకుంది. కరాటం ఎర్ర కాలువ జలాశయం నుంచి నీటి విడుదలను నాలుగు వేల క్యూసెక్కుల కుదించడంతో నీటి మట్టం తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

ఆయుధాగారం నిర్మాణం ఆపాలి

జంగారెడ్డిగూడెం: జీలుగుమిల్లి ప్రాంతంలో నౌకాదళ ఆయుధాగారం నిర్మాణం నిలిపివేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యదర్శి టి.సుధాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మాట్లాడుతూ ఆయుధాగారం నిర్మాణం కోసం ఏలూరు కలెక్టర్ ఆఫీస్‌లో జరిగిన సమావేశంలో ఎంపీ పుట్టా మహేష్ జీలుగుమిల్లి ప్రాంతంలో ఆయుధ కర్మాగారం నెలకొల్పుతున్నట్టు ప్రకటించారన్నారు. దీనికి భూమిని ఆదివాసీల నుంచి సేకరిస్తున్నట్లు తెలిపారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇప్పటికే ఆదివాసీ ప్రాంతంలో అభివృద్ధి పేరిట ప్రాజెక్టుల పేరిట వేలాది ఎకరాల భూములను గిరిజనులు కోల్పోయారన్నారు. పోలవరం ముంపు నిర్వాసితులు వేలాది ఎకరాలు కోల్పోయారు. వారిని తీసుకువచ్చి జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం మండలాల పరిధిలో పెట్టడం వల్ల ఇప్పటికే ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఆయుధాగారం పేరు చెప్పి ఉద్యోగాలు వస్తాయని చెబుతున్నారని, ఆయుధాలు నిల్వచేసే ప్రదేశంలో ఉద్యోగాలు దొరుకుతాయని ప్రకటించడం హాస్యస్పదంగా ఉందన్నారు. ఆయుధ కర్మాగారానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని, ప్రజలు దీన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం

మరో మహిళ ఆచూకీ కోసం గాలింపు


వాగులో గల్లంతై మృతి చెందిన చిన్నమ్మ మృతదేహం

బుట్టాయగూడెం: కూలి పనుల కోసం వెళ్లి వాగులో గల్లంతైన జీలుగుమిల్లి మండలం పూచికపాడుకు చెందిన ఇద్దరు మహిళల్లో ఒకరి మృతదేహాన్ని ఆదివారం పోలీసులు పెద్దవాగు ప్రాజెక్టు డ్యామ్‌లో గుర్తించారు. మహిళలు గల్లంతయ్యారనే సమాచారంతో ఆంధ్రా, తెలంగాణ పోలీసులు శనివారం నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. తెలంగాణ పోలీసులతోపాటు పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, జీలుగుమిల్లి సీఐ బి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్‌డీఎఫ్ సిబ్బందితో కలిసి సహాయ చర్యలు ప్రారంభించారు. ఆదివారం మధ్యాహ్నానికి గల్లంతైన ఇద్దరిలో చిన్నమ్మ మృతదేహాన్ని గుర్తించారు. మరో మహిళ వరలక్ష్మి కోసం గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. గల్లంతైన మహిళ కోసం డ్రోన్ సాయంతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

సాయిబాబా పుట్టిన రోజు వేడుకలకు ఏర్పాట్లు

సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు వెల్లడి

కైకలూరు: భగవాన్ సత్యసాయిబాబా 100వ పుట్టినరోజు వేడుకలకు ప్రపంచ వ్యాప్తంగా 15 లక్షల మంది భక్తులు విచ్చేస్తారనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నట్లు సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు చెప్పారు. ఏలూరు జిల్లా కైకలూరులోని సత్యసాయి మందిరం వద్ద శాశ్వత ఉచిత ఉపాధి శిక్షణ కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. నవంబర్ 13 నుంచి 24 వరకు బాబా పుట్టినరోజు వేడుకలను పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులకు అన్ని రోజులూ వసతి, భోజన సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తామన్నారు. నవంబర్ 19న ప్రశాంతి నిలయాన్ని ప్రధాని మోదీ సందర్శిస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది నుంచి సత్యసాయి ఆశ్రిత కల్ప పేరుతో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల్లో చదివే బీటెక్, ఎంటెక్, బీఈడీ విద్యార్థులకు బాబా మందిరాల్లో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.

స్కూల్ గేమ్స్ జట్ల ఎంపికలు


షూటింగ్ చేస్తున్న క్రీడాకారులు

వీరవాసరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2025 –26 విద్యా సంవత్సరానికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అండర్–14, అండర్–17 బాల బాలికల రైఫిల్ షూటింగ్ ఎంపికలు 16న శ్రీ చింతలపాటి బాపిరాజు మున్సిపల్ హైస్కూల్ భీమవరంలో, ఆర్చరీ ఎంపికలు 17న వోల్గాస్ అకాడమీ భీమవరంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు డి.సునీత, పీఎస్ఎన్ మల్లేశ్వరరావు ఆదివారం తెలిపారు. వివరాలకు 91002 85197, 7013865335 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఈ-కంటెంట్ అభివృద్ధి శిక్షణకు ఎంపిక


బొబ్బిలి రాజమౌళి కోటేశ్వర స్వామి

కాళ్ల: ఎన్‌సీఈఆర్‌టీ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ఈ–కంటెంట్ అభివృద్ధి కోసం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి ఉపాధ్యాయులను స్టేట్ రిసోర్స్ గ్రూప్ మెంబర్స్‌గా ఎంపిక చేస్తున్నారు. ఆన్‌లైన్ శిక్షణలో మన రాష్ట్రం నుంచి ఎంపిక చేసిన 20 మంది ఎస్‌ఆర్‌జీలలో కాళ్ళ మండలంలోని మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాల స్పెషల్ సీసలి ఉపాధ్యాయుడు బొబ్బిలి రాజమౌళి కోటేశ్వర స్వామి ఎంపికయ్యారని కాళ్ళ మండల విద్యాశాఖ అధికారి డి.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఇంతకుముందు ఈ–కంటెంట్ రూపకల్పనలో భాగంగా మూడో తరగతి గణితానికి సంబంధించి రూపొందించిన వీడియోలు ఏపీ ఈ–పాఠశాల యాప్ ప్రభుత్వ యూట్యూబ్ ఛానల్‌లో పొందుపర్చిందని స్వామి మాస్టారు తెలిపారు.

కత్తితో దాడి చేసి నగల చోరీ


దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న నాగేశ్వరమ్మ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కిరాణా దుకాణాన్ని నిర్వహిస్తున్న ఆమెపై గుర్తు తెలియని ఆగంతకుడు కత్తితో దాడి చేసి బంగారు నగలు అపహరించుకుపోయాడు. ఏలూరు మూడో పట్టణ పరిధిలోని వట్లూరు వద్ద సింగంశెట్టి నాగేశ్వరమ్మ కిరాణా దుకాణాన్ని నిర్వహిస్తోంది. గుర్తు తెలియని ఆగంతకుడు ఆదివారం రాత్రి 6. 30 గంటల సమయంలో దుకాణం వద్దకు వచ్చి కూల్ డ్రింక్ కావాలని అడిగాడు. కూల్‌డ్రింక్ తెచ్చేందుకు ఆమె లోనికి వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా చాకుతో విచక్షణారహితంగా దాడి చేశాడు. దాడిలో ఆమె మొఖం, దవడ, తలపై తీవ్ర గాయాలయ్యాయి. ఆమె ఒంటిపై ఉన్న నగలను అపహరించుకుపోయాడు. ఆమె కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకునే సరికి ఆగంతుకుడు పరారయ్యాడు. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. మూడో పట్టణ పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు.

గాలికుంటు.. టీకాతో తరిమి కొట్టు

- నేటి నుంచి వ్యాధి నివారణా టీకాల కార్యక్రమం
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న పశు వైద్యులు


గాలికుంటు సోకిన గేదె


గేదె కాలికి పడిన పుండు

ద్వారకాతిరుమల: పాడి పశువులు బాగుంటేనే.. పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతుంది. అందుకే పశువుల సంరక్షణ పట్ల రైతన్నలు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. సీజనల్ వ్యాధుల బారి నుంచి వాటిని కాపాడుకోవాలి. ప్రస్తుత సీజన్‌లో ఎద్దులు, దున్నలు, ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు గాలికుంటు వ్యాధి (ఫుట్ అండ్ మౌత్ డిసీజ్) సోకే ప్రమాదం ఉంది. వైరస్ కారణంగా వచ్చే ఈ వ్యాధి ప్రభావం వర్షాకాలంలోనే అధికంగా ఉంటుంది. దీని బారిన పడిన పశువుల్లో ఉత్పాదకత తగ్గిపోతుంది. తద్వారా పశుపోషకులకు తీవ్ర నష్టం కలుగుతుంది.



సరైన చికిత్సా విధానాలు పాటిస్తే పశువులు, జీవాలను ఈ వ్యాధి బారి నుంచి కాపాడుకోవచ్చని పశువైద్యులు సూచిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 15 నుంచి అక్టోబర్ 15 వరకు గాలికుంటు నివారణా టీకాల కార్యక్రమం నిర్వహించనున్నారు.

వ్యాధి లక్షణాలు

- గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు గాలికుంటు వ్యాధి వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ వ్యాధి సోకిన సమయంలో పశువుల్లో గర్భం విఫలమవుతుంది. వేడిని తట్టుకోలేవు.
- ఈ వ్యాధికి గురైన గేదె, మేక, గొర్రె వంటి జీవాల్లో తీవ్రమైన జ్వరం కనిపిస్తుంది. పాల దిగుబడి తగ్గడం, నోరు, మూతి, కాళ్లు, పొదుగు మీద పుండ్లు, బొబ్బలు కనపడటం, కాళ్లు కుంటడం, నోటి నుంచి విపరీతంగా నురగ కారడం వంటి లక్షణాలు ఉంటే గాలికుంటు సోకినట్టు గుర్తించాలి.
- ఆగస్టు, సెప్టెంబర్, మార్చి, ఏప్రిల్ మాసాల్లో ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంది. దీని వల్ల మరణాల శాతం తక్కువైనప్పటికీ పశువుల్లో ఉత్పాదక సామర్థ్యం తగ్గుతుంది. జ్వరం తీవ్రత 104 నుంచి 106 డిగ్రీల ఫారన్‌హీట్ వరకు పెరిగి పశువులు నీరసిస్తాయి. పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది.
- నోటి ఎపిథీలియం (పైపొర), పళ్లు, చిగుళ్లు, నాలుక, ముట్టె లోపలి ప్రాంతాల్లో బొబ్బలు ఏర్పడతాయి. అవి 24 గంటల్లో చితికి పోవడం వల్ల పశువులు నొప్పితో మేత తినవు. నోటి నుంచి చొంగ కారుతుంది.
- చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి. పొదుగుపై బొబ్బలు ఏర్పడి ఒక్కొక్కసారి పొదుగువాపు సంభవిస్తుంది. పశువులు శ్వాసను కష్టంగా పీల్చుతూ, రొప్పుతూ ఎండ వేడిమికి తట్టుకోలేక నీరసిస్తాయి.

వైరస్ వ్యాప్తి చెందేదిలా..

నోరు, కాలు వ్యాధికి గురైన పశువుల అంతస్రావాల (లాలాజలం, పుండ్ల నుంచి కారే రసి) వల్ల మిగతా పశువులకు వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉంది. వ్యాధికారక క్రిమి ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది. గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. సంకరజాతి పశువులు త్వరగా ఈ వ్యాధి బారిన పడతాయి.

నివారణ ఇలా

పశువులు బాగా బలహీనంగా ఉంటే గ్లూకోజ్ రక్తంలోకి ఇవ్వాల్సి ఉంటుంది. నోటిలో పుండ్ల వల్ల మేత మేయవు కనుక వాటికి సులభంగా జీర్ణమయ్యే పోషక పదార్థాలతో కూడిన ఆహారం అందించాలి. జావ, జొన్న, అన్నం, బెల్లంతో కలిపి ప్రతిరోజూ తాగించడం ద్వారా బలహీనపడవు. ఈ వ్యాధి సోకిన పశువులను వేరు చేయాలి. వాటి మలమూత్రాలను గడ్డిలో కాల్చివేయాలి. చనిపోయిన పశువులను సున్నపు గోతిలో పూడ్చాలి. ఆబోతులు, దున్నల వీర్యం ద్వారా కూడా వ్యాధి వ్యాపిస్తుంది. అందువల్ల వ్యాధి సోకిన వాటిని సుమారు మూడు నెలల వరకు సంపర్కానికి వినియోగించకూడదు. కాలిగిట్టల మధ్య పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణాలతో కడిగి నీమ్‌లెంట్, వేపనూనె పూయాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్ చల్లి, గ్లిజరిన్ కలిపి రాయాలి. వైద్యుడిని సంప్రదించి అవసరమైన మందులు వాడాలి.

టీకాలు వేయించాలి



గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలి. పశువైద్యశాఖ ద్వారా ఈనెల 15 నుంచి వచ్చేనెల 15 వరకు ఈ టీకాలను ఉచితంగా వేస్తాం. రైతులు నిర్లక్ష్యం చేయొద్దు. గాలికుంటు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి. – అంగర సురేష్, మండల పశువైద్యాధికారి, ద్వారకాతిరుమల

ధర లేక ఉల్లి రైతు గగ్గోలు



రోడ్లపై ఉల్లిపాయలు ఏరుకుంటున్న ప్రజలు



వాహనాలపై ఉల్లి బస్తాలు తీసుకెళుతున్న వ్యక్తి

- రోడ్ల నిండా అదే సీన్
- ఇంటింటికీ ఆటోల్లో తిరిగి అమ్మకాలు
- మూడు లారీలు మాత్రమే వచ్చాయి

తాడేపల్లిగూడెం: ఊరేగింపు ఉల్లిపాయలు అంటే చాలా గ్రామాల్లో ఈ అమ్మకాలు తెలిసిందే. నాసి రకం ఉల్లిపాయలను మార్కెట్‌లో కొనుగోలు చేసి, ఇళ్ల దగ్గరకు తీసుకెళ్లి కాస్త ఎండబెట్టి, వాటిని గ్రేడింగ్ చేసి, ఆటోల్లో మైకులు పెట్టి రూ.100కు నాలుగు, ఐదు కేజీల చొప్పున విక్రయించడాన్ని ఉల్లిపాయల ఊరేగింపు అమ్మకం అంటారు. ఎక్కువగా ఇలా కర్నూలు ఉల్లిపాయలు, కొన్ని సందర్భాల్లో షోలాపూర్ ఉల్లిపాయలను అమ్ముతుంటారు. ప్రస్తుతం కర్నూలు ఉల్లిపాయలు పండించిన రైతుల పరిస్థితి బాగోలేక, మార్క్‌ఫెడ్ ఉల్లిపాయలను కొనుగోలు చేసి మార్కెట్లకు తరలించినా, వాటిని కొనే నాథుడు లేక, గుత్త దుకాణాల్లో నిల్వ ఉంచుకోలేక వ్యాపారులు నష్టంవస్తే, వచ్చిందిలే అనుకొని వారి లారీల్లోనే గ్రామాలకు అనుసంధాన రహదారులుగా ఉన్న ప్రాంతాల్లో రోడ్ల పొడవునా దింపుకుంటూ వెళుతున్నారు. దీంతో గడచిన ఐదు రోజులుగా ఎక్కడ చూసినా రోడ్లపై ఎక్కువగా కోడేరు నల్లజర్ల రోడ్డు, చినతాడేపల్లి, పెదతాడేపల్లి, వెల్లమిల్లి రోడ్లు , మార్కెట్‌లో కొన్ని ప్రాంతాల్లో రోడ్ల పక్కన పడేసిన బస్తాలు, వాటిని ఇళ్లకు తీసుకెళ్లడానికి పెద్ద ఎత్తున గుమిగూడే ప్రజలు కనిపిస్తున్నారు. ద్విచక్ర వాహనాలపై ఉల్లి మూటలు తీసుకెళ్లడం శనివారం వరకు కనిపించింది. రోడ్ల పక్కన పడేసిన ఉల్లిపాయలను తీసుకెళ్లడానికి కార్లు కూడా వేసుకొచ్చిన పరిస్థితి ఆదివారం కనిపించింది. ఒక్కో ద్విచక్ర వాహనంపై మూడేసి బస్తాలు వేసుకెళుతున్నారు. పాక్లెయినర్ తొండంలో బస్తాలు నింపుకొని వెళ్లిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థి తుల్లో కొన్ని ఉల్లిపాయల ఊరేగింపు జరుగుతున్నట్టుగా ఉంది.

మార్కెట్‌కు మూడు లారీలే వచ్చాయి

శనివారం రాత్రి మార్కెట్‌కు వచ్చిన కర్నూలు రకం ఉల్లిపాయలను ఆదివారం ఉదయం వేలం వేస్తే కిలో రూ.6కు వెళ్లాయి. కడప జిల్లా మైదుకూరు ప్రాంతం నుంచి ఆదివారం మూడు లారీల ఉల్లిపాయలు వచ్చాయి. కర్నూలు రకంతో పోలిస్తే వీటిలో కాస్త నాణ్యత అధికంగా ఉండటంతో కిలో గరిష్ఠంగా రూ.12 పలికాయి.

కర్నూలులో అమ్మితేనే లాభం

కర్నూలు ప్రాంతంలో పండిన ఉల్లిపాయలను కర్నూలు మార్కెట్ యార్డులోనే అమ్ముకుంటే రైతులకు లాభం వచ్చే అవకాశాలున్నాయి. ప్రభుత్వం కిలో ఉల్లిపాయలను కనీసం రూ.11కు కొనాలని ఆదేశాలు ఇచ్చింది. ఉల్లిపాయాలను అక్కడి నుంచి గూడెం తీసుకొచ్చినా నాణ్యత ఆధారంగా ధర లభించే అవకాశాలు ఉన్నాయి. ఆదివారం వందల సంఖ్యలో ఇక్కడకు రావాల్సిన ఉల్లిపాయలు రాలే దు. కర్నూలు రైతులు అక్కడే ఉల్లిని అమ్ముకుంటున్నారు. కడప నుంచి ఉల్లిపాయలు వచ్చాయి. మహారాష్ట్ర, షోలాపూర్, నాసిక్ ప్రాంతాల నుంచి పాతరకం ఉల్లిపాయలు మార్కెట్‌కు రాలేదు.

ఉల్లి అమ్మకాలు పరిశీలించిన జేసీ

బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లో ఉల్లిపాయల వేలాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదివారం ప్రత్యక్షంగా పరిశీలించారు. పెద్దపెద్ద మాల్స్‌లో, రేషన్ దుకాణాల్లో ఉల్లిపాయలను విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, జేసీ వ్యాపారులను కోరారు. మార్కెట్‌యార్డులు, రైతు బజార్ల ద్వారా ఉల్లికి ఎక్కువ ధర వచ్చేలా చర్యలు చేపట్టి ఉల్లి రైతులను ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట ఆర్‌డీఓ ఖతీబ్ కౌసర్‌భానో, మార్కెట్ యార్డు డీడీ పాపారావు, జిల్లా మార్కెటింగ్ ఏడీ కె.సునీల్‌కుమార్, తహసీల్దార్ సునీల్‌కుమార్ ఉన్నారు.

క్లుప్తంగా

నడకతో ఆరోగ్యం



బహుమతులు అందజేస్తున్న వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ రామరాజు

తణుకు అర్బన్: ఒత్తిడితో కూడిన నేటి రోజుల్లో ప్రతి ఒక్కరూ వాకింగ్ బాటపట్టాలని వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ గుంటూరి రామరాజు అన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా నాల్గవ క్యాబినెట్ సమావేశం తణుకు రోటరీ క్లబ్ ఆవరణలో అధ్యక్షుడు బసవ రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్ ద్వారా ఆరోగ్య సూచనలతోపాటు సేవా కార్యక్రమాలను విస్తృతపరిచామని స్పష్టం చేశారు. సభ్యులంతా సేవాకార్యక్రమాలకు సహకరించాలని సూచించారు. అనంతరం సభ్యులకు గుర్తింపు మెడల్స్ అందచేశారు. ఉపాధ్యక్షుడు పరిమి దేవబాబు, కార్యదర్శి మొనవర్తి శంకరరావు, కోశాధికారి చిక్కాల సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం



నినాదాలు చేస్తున్న నాయకులు

తణుకు అర్బన్: 103వ రాజ్యాగ సవరణ ద్వారా కేంద్రం ప్రవేశ పెట్టిన ఎకనామికల్ వీకర్ సెక్షన్ రిజర్వేషన్ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని బీసీ సంఘాల ఐక్య వేదిక నాయకులు చోడే గోపి అన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై తణుకు బీసీ, ఎస్సీ సంఘాల ఆధ్వర్యంలో బీసీ హాలులో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ప్రతిభకు పాతర వేస్తున్నాయని, ఆర్థిక రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమన్నారు. కార్యక్రమంలో గూడూరి వెంకటేశ్వరరావు, కౌరు వెంకటేశ్వరరావు, కామన మునిస్వామి, గంజి మధు, పొట్ల సురేష్, పేరూరి మురళి కుమార్, సోమశేఖర్, బాలు, సురేష్ పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ సేవలు విస్తృతం చేయాలి



ఆర్‌ఎస్‌ఎస్ నాయకుల నుంచి గణవేష అందుకుంటున్న హరిశ్చంద్రప్రసాద్(హరిబాబు)

తణుకు అర్బన్: ఆర్‌ఎస్‌ఎస్ సేవలు విస్తృతం చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఏర్పడి విజయ దశమికి 100 వసంతాలు పూర్తి కానున్న సందర్భంగా ఆదివారం తణుకు రామకృష్ణ మఠంలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వచ్చే నెల 2వ తేదీన నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకులు పలు విషయాలపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్(హరిబాబు) ఆర్‌ఎస్‌ఎస్ నాయకుల నుంచి గణవేష అందుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లిన రాధాకృష్ణ తదతరులు పాల్గొన్నారు.

ఉచిత ధ్యాన శిక్షణ



ఉచిత ధ్యాన శిక్షణ ఇస్తున్న దృశ్యం

వీరవాసరం: వీరవాసరంలోని శ్రీ సీతారామ స్వామి దేవస్థానం ప్రాంగణంలో వీరవాసరం మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మట్టగుంట గ్రామానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ తిరుమాని బ్రహ్మం పాల్గొని జ్ఞాన బోధచేసి ధ్యాన శిక్షణ ఇచ్చారు. భగవద్గీతశ్లోకాలు, ఆధ్యాత్మిక గీతాలు రాగయుక్తంగా పాడి, యోగార్థాలను వివరించి అందరితో ధ్యానం చేయించారు. జిల్లా కోఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 16 నుంచి 22వ తేదీవరకు తిరుపతిలో జరిగే ధ్యాన మహాయజ్ఞంకు అందరూ రావాలని కోరారు.

రోడ్డు కోసం రిలే దీక్షలు

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలం వెంప–మొగల్తూరు రహదారి నిర్మాణ పనులు వెంటనే చేపట్టాని కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి ఆరో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఐక్యవేదిక కన్వీనర్ యడ్ల చిట్టిబాబు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం చేపట్టకపోతే ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

యలమంచిలి: మండలంలోని గుంపర్రు పంచాయతీ కడిమిపుంతలో ఇరు వర్గాల మధ్య సరిహద్దు వివాదం కారణంగా ఘర్షణ చెలరేగింది. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల వారు ఒకరి పై ఒకరు కేసు పెట్టడంతో ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

8 మంది వృద్ధులకు వైద్య సేవలు



వృద్ధుడికి ఉచిత వైద్య సేవలందిస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం తణుకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇంటికే పరిమితమైన వృద్ధులకు వైద్య సేవలందించారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య ప్రత్యేక వాహనం ద్వారా తణుకు, పైడిపర్రు ప్రాంతాల్లోని 8 మంది రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. కందా వెంకట ప్రభాకరం ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకరచౌదరి తెలిపారు. ఉచిత వైద్యసేవలు అవసరమైన వారు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి అర్జి భాస్కరరావు,నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కారుమూరిపై వ్యక్తిగత దూషణలు ఆపాలి



సమావేశంలో మాట్లాడుతున్న లీగల్‌సెల్ సభ్యుడు సాయిబాబారెడ్డి

తణుకు అర్బన్: రాజకీయ ఆరోపణలను తట్టుకోలేక తణుకులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుపై విష పూరితంగా వ్యక్తిగత దూషణలకు దిగడాన్ని బహుజన కులాల తరపున ఖండిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎస్సీఎస్టీబీసీ మైనారిటీ వర్గాల నియోజకవర్గ పరిశీలకులు చింతపల్లి గురుప్రసాద్ పేర్కొన్నారు. తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తణుకు నియోజకవర్గంలో మొదటి నుంచి బహుజన కులాలపై టీడీపీ వర్గం చిన్నచూపు చూసే ధోరణిని అవలంభిస్తుందని అదే తత్వంతో నేడు బీసీ వర్గానికి చెందిన కారుమూరిపై టీడీపీ కార్యకర్తలతో దూషణలు చేయిస్తుండడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గంజాయి, మద్యం విక్రయాలు పెరిగిపోయి విపరీతంగా చలామణీ కావడంతో యువత చెడు మార్గంలోకి వెళ్లే పరిస్థితి దాపురించిందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ సభ్యులు వెలగల సాయిబాబారెడ్డి, పార్టీ తణుకు పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి మాట్లాడుతూ రాజకీయాలు హుందాగా ఉండాలని, వ్యక్తిగత దూషణలు సరికాదని వివరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, తణుకు మండల మహిళాధ్యక్షురాలు ఉండవల్లి జానకి, వీరమల్లు ఫణీంద్ర కుమార్, పైడి సాయిసూర్య, కొమ్మోజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాతకు విరాళం బాండ్‌ను అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు ఆదివారం రూ.లక్ష విరాళంగా అందించారు. తణుకు మండలం వెంకటరాయపురంనకు చెందిన పాతూరి వెంకట సత్య విశ్వనాథకుమార్ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ విరాళం బాండ్‌ను అందజేశారు.

రోటరీ సేవలు అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి

తణుకు అర్బన్: ప్రపంచ వ్యాప్తంగా రోటరీ క్లబ్ అందజేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని రోటరీ క్లబ్ గవర్నర్ డాక్టర్ వై.కల్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. ముఖ్యంగా పోలియో నిర్మూలనలో రోటరీ కీలకపాత్ర పోషించి సఫలం కావడం గర్వంగా ఉందని స్పష్టం చేశారు. క్లబ్ అధ్యక్షుడు కలగర వెంకటకృష్ణ అధ్యక్షతన తణుకు వీకే ఫంక్షన్ హాలులో నిర్వహించిన రోటరీ క్లబ్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భవిష్యత్తు కార్యాచరణలో భాగంగా రోటరీ సంస్థ విద్యార్థి దశలోనే సేవాదృక్పథాన్ని పెంపొందిచడంతోపాటు నాయకత్వ లక్షణాలను విద్యార్థులకు చేరువ చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 9, 10 తరగతుల విద్యార్థులకు గుండె నొప్పి బాధితులకు సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడే విధానంపై అవగాహన కల్పిస్తామని, విద్యార్థినులకు గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్ అంశాలను తెలియపరచనున్నట్లు చెప్పారు. ముందుగా ముళ్లపూడి వెంకటరమణమ్మ హాస్పిటల్‌ను సందర్శించి రోటరీ అందించిన డయాలసిస్ మెషిన్లను పరిశీలించారు. సభ్యుడు శ్రీనివాసరావు సౌజన్యంతో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించి 160 మందికి కళ్ల జోళ్లను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ ఆర్‌వీ అప్పారావు, డిస్ట్రిక్ట్ పోలియో చైర్ వై.పార్థసారథి, సభ్యులు పాల్గొన్నారు.

తండ్రి అదృశ్యంపై ఫిర్యాదు

తాడేపల్లిగూడెం రూరల్: తండ్రి కనిపించడం లేదంటూ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై జేవీఎన్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెదతాడేపల్లి గ్రామానికి చెందిన పసుమర్తి నాగేశ్వరరావు (50) ఈ నెల 13న ఉదయం 7.30 గంటల ప్రాంతంలో కూలీ పనికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని, బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ కానరాలేదు. దీంతో అతడి కుమారుడు పసుమర్తి కుమార్ అవినాష్ ఆదివారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై జేవీఎన్ ప్రసాద్ తెలిపారు.

విద్యతోనే ఉన్నత జీవితం



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, రిసోర్స్ పర్సన్లు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యతోనే ఉన్నత జీవితం సాధ్యమని పలువురు వక్తలు అన్నారు. స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదువు అంటే మా కిష్టం కార్యక్రమం గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రిసోర్స్ పర్సన్లు కేవీ సత్యప్రకాష్, ప్రత్తి వీరాస్వామి, జి.బాపయ్యశర్మ, ఎ.జనార్ధనరావు, వి.ఆంజనేయులు, వి.జాన్ బాబులు హాజరై విద్యార్థులకు గ్రంథాలయం, విజ్ఞానం, పుస్తక పఠనం, పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవ్వడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పుస్తక సమీక్ష నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు



మిల్లర్లతో సమావేశమైన జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి

తాడేపల్లిగూడెం: ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరలో ఏర్పాటు చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకుగాను ఆదివారం స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ, వ్యవసాయ, సహకార శాఖ అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో ధాన్యం సేకరణ గురించి మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలుకు గాను త్వరిత గతిన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు కావాల్సిన గోనె సంచులు, సిబ్బంది, ధాన్యం రవాణా చేసే వాహనాలు సిద్ధం చేయాలన్నారు. గూడెం మండలంలో ఇప్పటి వరకు 80 ఎకరాల వరకు కోతలు జరిగాయని అధికారులు తెలిపారు. మండలంలోని కడియద్దలో రైతు సేవా కేంద్రాన్ని జేసీ సందర్శించారు. తేమ శాతం యంత్రాన్ని పరిశీలించారు. ఆర్డీవో ఖతీబ్ కౌసర్ భానో, తహసీల్దార్ సునీల్, మండల వ్యవసాయాధికారి బి.నారాయణరావు, సహకార శాఖ ఎంఎల్ఓలు, రైస్ మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

17న స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్



డీఎంహెచ్‌వో గీతాభాయి

భీమవరం (ప్రకాశంచౌక్): మెరుగైన ఆరోగ్య సంరక్షణ సేవల ద్వారా మహిళలు, పిల్లలకు సాధికారత కల్పించే లక్ష్యంతో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌ను దేశవ్యాప్తంగా ఈనెల 17వ తేదీన ప్రారంభించనున్నారని డీఎంహెచ్‌వో గీతాభాయి తెలిపారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా మొత్తం 471 ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు, ఈ శిబిరాల్లో ప్రత్యేకంగా మహిళలు, పిల్లలకు విస్తృత వైద్య సేవలను అందిస్తామన్నారు. ప్రసూతి, కంటి పరీక్షలు, ఈఎన్‌టీ, దంత, చర్మవ్యాధి, మధుమేహం, రక్తపోటు, కేన్సర్లు, టీబీ, ఎనీమియా, సికిల్ సెల్ వ్యాధి స్క్రీనింగ్, గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు, పోషణ సలహాలు, రక్తదాన కార్యక్రమాలు, పౌష్టికాహార అవగాహన, వయో వందన కార్డుల నమోదులు జరుగుతాయన్నారు, ప్రోగ్రాం ఆఫీసర్ కేఎంఆర్ కిషోర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆరోగ్యవంతమైన కుటుంబాలు, శక్తివంతమైన సమాజాల నిర్మాణమే లక్ష్యంగా ఈకార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

వైభవంగా వినాయకుడి ఊరేగింపు



ఊరేగింపులో 18 అడుగుల వినాయకుడి విగ్రహం



శక్తి వేషాలతో కాళీమాత డ్యాన్స్ బృంద సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని వన్ టౌన్ వానపల్లిగూడెం ఆరు కొట్ల సెంటర్ సిద్ధి వినాయక ఫ్రెండ్స్ సర్కిల్ పవర్ బాయ్స్ ఆధ్వర్యంలో 18 అడుగుల వర సిద్ధి వినాయకుడిని ఆదివారం సాయంత్రం వైభవంగా ఊరేగించారు. తీన్‌మార్ డప్పులు, మేళా తాళాలు, శ్రీ కోట సత్తెమ తల్లి కాళీ మాత డ్యాన్స్ బృందం వారిచే శక్తి వేషాలు, పలు వేషధారణలతో, బాణసంచా పేలుళ్లతో అత్యంత వైభవంగా స్వామి వారిని ఊరేగించారు. ఊరేగింపు వానపల్లిగూడెం నుంచి వీకర్స్ కాలనీ, బస్సు కాంప్లెక్స్ మీదుగా తాలూకా సెంటర్, ఎన్‌టీఆర్ జంక్షన్, పోలీస్ ఐలాండ్ మీదుగా స్థానిక ఏలూరు కాలువలో స్వామి వారిని నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు.

ఇలపర్రు వైఎస్సార్ సీపీ కమిటీ నియామకం

పెనుగొండ: మండలంలోని ఇలపర్రు వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడిగా పులిదిండి మోహనరావు నియమితులయ్యారు. ఆదివారం సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాలతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బొక్కా సుబ్రహ్మణ్యం, యూత్ అధ్యక్షుడిగా నక్కా పాల్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా దిడ్ల శ్రీను, బీసీ సెల్ అధ్యక్షుడిగా చిన్ని శ్రీను, రైతు విభాగం అధ్యక్షుడిగా కట్టా ఏడుకొండలు, మహిళా అధ్యక్షురాలుగా కొచ్చర్లపాటి కుమారిలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, వేండ్ర వెంకటేశ్వర్లు, సాదే గోపాలం, కోలాటి శ్రీరామ్ మూర్తిచ కటికతల మోహనరావు, గుణపాటి సంజీవరావు, దిడ్ల వెంకట్రావు, పీతల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.